క్లుప్తంగా

గండిలో ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను స్వామి వారి చిత్రపటంతో సత్కరిస్తున్న ఆలయ అర్చకులు

చక్రాయపేట : గండి క్షేత్రంలో వెలసిన వీరాంజనేయస్వామిని ఆదివారం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి కుటుంబ సభ్యులతో వచ్చి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతించి ప్రత్యేకంగా పూజలు చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వేదపారాయణదారు రామమోహన్ శర్మ, ఆలయ సూపరెంటెండెంట్ షరీఫ్, ఇన్‌స్పెక్టర్ రవిచంద్రారెడ్డిలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి

సింహాద్రిపురం : సింహాద్రిపురం నుంచి వెలిదండ్ల గ్రామం మీదుగా తిరిగే ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు. గతంలో ఈ రూట్‌లో విద్యార్థులకు మాత్రమే ఆర్టీసీ బస్సు తిరిగేది. కానీ మండల ప్రజలు ఆర్టీసీ అధికారులను విన్నవించుకోవడంతో అప్పట్లో సెటిల్ బస్సును తిప్పివేవారు. అయితే ప్రస్తుతం ఉన్నఫలంగా ఆ బస్సు సర్వీసును ఆపేశారు. దీంతో ప్రజలు విధిలేని పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. విద్యార్థులు కూడా ఈనెల 13 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో బస్సులు లేక అగచాట్లు పడుతున్నారు. వెంటనే ఆర్టీసీ అధికారులు విద్యార్థులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బస్సును పునరుద్ధరించాలని కోరుతున్నారు.

సంస్కృతి సంప్రదాయాల సమాహారం శిల్పారామం

పులివెందుల టౌన్ : సంస్కృతి సంప్రదాయాల సమాహారం శిల్పారామమని శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని సోమవారం సాయంత్రం శిల్పారామంలో సూర్యడ్యాన్స్ అకాడమి, మదనపల్లి మాస్టర్ సూర్య వారి చిన్నారులచే క్లాసికల్, జానపద, వెస్టర్న్, తదితర నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే డాక్టర్ వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో బక్రీదు పండుగను పురస్కరించుకుని కిషోర్ డ్యాన్స్ అకాడమి, కడప మాస్టర్ కిషోర్ వారి చిన్నారులచే క్లాసికల్, జానపద, వెస్టర్న్ నృత్యప్రదర్శనలు నిర్వహిస్తున్నారన్నారు. పట్టణ ప్రజలు విరివిగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

అవోపా అధ్యక్షుడిగా ప్రతాపం

కడప కల్చరల్ : ఆర్యవైశ్య ప్రొఫెషనల్ అండ్ అఫీసియల్స్ అసోసియేషన్ (అవోపా) కడప యూనిట్ అధ్యక్షుడిగా సాయిరాం ప్రతాపం ఎన్నికయ్యారు. ఆదివారం కడప నగరం అమ్మవారిశాలలో ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. ఈ ఎన్నికల్లో సాయిరాం ప్రతాపం అధిక మొత్తంలో ఓట్లు సాధించి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ముచ్చల్ల వెంకట సుబ్బయ్య, మునగా శ్రీనివాస్, యాదాళ్ల రమణ తెలిపారు. ఈ సందర్భంగా సాయిరాం ప్రతాపంను పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

సేవకు సత్కారం

కడప ఎడ్యుకేషన్ : కడపలో మూడేళ్ల నుంచి రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి అనే కరపత్రాలు ప్రజలకు, విద్యార్థులకు, యువతకు పంచుతూ ప్రచారం చేస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు, రాయల్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ షేక్ రాయల్ కరీముల్లాను ఘనంగా సన్మానించారు. జిల్లా పెన్షనర్ల కార్యాలయంలో సంఘం ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా రెడ్ క్రాస్ తరపున జ్ఞాపిక బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అసోసియేషన్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ, సభ్యులు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలలను మూసేయాలి

పోరుమామిళ్ల: ప్రభుత్వ అనుమతి లేని పాఠశాలలను మూసేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అభిలాష్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలను వేలాది రూపాయలకు అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రులను మానసిక వేదనకు గురిచేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై చర్య తీసుకోవాలని అభిలాష్ డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఫీజుల వివరాలను నోటీస్ బోర్డులో పెట్టేలా అధికారులు చర్య తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుకు కృషి చేయాలని, త్వరలో డీఎస్సీ నిర్వహించి, ఖాళీలు భర్తీ చేయాలని కోరారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాల

అట్లూరు: మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో వెలసిన పోలేరమ్మ తల్లి తిరునాల వైభవంగా నిర్వహించారు. శనివారం బియ్యపు కొలతతో మొదలైన తిరుణాల శనివారం రాత్రికి సిద్దాఘతి నిర్వహించారు. అనంతరం పోలేరమ్మ గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



పట్టణ పరిధి వలసపల్లె రోడ్డులో ఉన్న ఈద్గా



పట్టణంలో ఉన్న మసీద్

ఎర్రగుంట్ల : ముస్లింల పర్వదినమైన బక్రీద్ (ఈదుల్ అజ్హా) త్యాగానికి ప్రతీకగా జరుపుకుంటారు. ముస్లింలకు ఏడాదిలో రెండు ప్రధాన పండుగలు. ఒకటి రంజాన్ కాగా, మరొకటి బక్రీద్. 17వ తేదీన బక్రీద్ పండుగను మైనార్టీ ముస్లిం లు ఘనంగా జరుపుకోనున్నారు.

బక్రీద్ పర్వదిన ప్రాధాన్యత..

దైవ ప్రవక్త హజరత్ ఇబ్రహీం(సా)కు అల్లాపెట్టిన అగ్ని పరీక్షల్లో భాగంగా ఏకైక కుమారుడు ఇస్మాయిల్ అలహిస్సలాం ఎనిమిదేళ్ల వయసులో ఉన్న బాలుడిని దేవుడి పేరిట త్యాగం చేయాలని ఆజ్ఞ వస్తుంది. ఇందులో భాగంగా అల్లా కలలో ఆదేశించిన సూచనల మేర అడవిలో ఏకాంత ప్రదేశంలో రాతిపై ఇబ్రహీం (సా) కుమారుడు ఇస్మాయిల్‌ను సమర్పించేందుకు తీసుకెళతారు. వెంట పదునైన కత్తి కూడా తీసుకెళ్తారు. బాలుడు ఎక్కడి తీసుకెళతున్నారని చిలిపి మాటలతో తండ్రిని పలుమార్లు ప్రశిస్తున్నా సమాధానం ఇవ్వలేదు. చివరకు అల్లా ఆదేశించిన ప్రదేశానికి తీసుకెళ్తారు. అక్కడకు వెళ్లి రాతిపై పడుకోబెట్టిన తరువాత కుమారుడికి



ఈద్గా వద్ద శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

అనుమానం కలిగి తనను సమర్పించమని అల్లా ఏమైనా ఆదేశించాడా? అని ప్రశ్నిస్తాడు. దీనికి అవునని సమాధానం చెబుతారు. దీంతో ఆ బాలుడు నాన్నా.. నామీద ఉన్న ప్రేమతో కత్తిని గొంతుపై కోయలేవు. నా మొహానికి బట్టకట్టి నాపై కత్తి కోయాలని చెప్పాడు. బాలురు చెప్పిన మేరకు గొంతుపై అతని తండ్రి వెంట తెచ్చుకున్న కత్తితో బలంగా కోసినప్పటికీ తెగలేదు. దీంతో బాలుడు తండ్రి కోపంతో రాతి గుండుపైకి కత్తిని విసరగా, ఆ పదునుకు రాయి రెండు ముక్కలవుతుంది. దీంతో అల్లా దేవదూత అయిన జిబ్రయిల్ (సా) అక్కడికి వచ్చి మీరు అల్లా పెట్టిన అగ్ని పరీక్షలో నెగ్గావు.. నీ కుమారుడి బదులు స్వర్గం నుంచి అల్లా స్వయంగా పెంచిన బలమైన పొట్టేలును వెంకట తెచ్చాను. దీన్ని జువా చేయాలని ఆదేశిస్తారు. దీంతో అప్పటి ప్రవక్త ఇబ్రహీం (సా) పొట్టేళ్లను జువా చేశారు. నాటి నుంచి నేటి వరకు అలాగే ప్రళయ దినం రోజు దాక బక్రీద్ పండగు రోజున ఆర్థిక స్థోమత గలిగిన ప్రతి ఒక్కరూ పొటేళ్లను జువా చేసి తండ్రి, కుమారుల త్యాగాన్ని స్మరించుకోవాలని హదీస్, ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ చెప్తోంది.

నిర్ణీత వేళకు ఈద్ నమాజ్‌కు హజరు కావాలి..

ఎర్రగుంట్ల పట్టణ పరిధిలో సోమవారం ఈదుల్ అజ్హ (బక్రీద్) పండుగ జరుపుకోన్నన్నట్లు అంజుమన్ కమిటీ మత పెద్దలు తెలిపారు. వలసపల్లి రోడ్డులో ఉన్న ఈద్గ్ వద్ద నిర్ణీత వేళకన్నా అరగంట ముందుగానే ముస్లింలు చేరుకుని నమాజ్ ఆచరించాలని సూచించారు. కచ్చితంగా నిర్ణీత వేళకు నమాజ్ ప్రారంభం అవుతుందనే విషయాన్ని గుర్తించి వేళకు చేరుకోవాలని తెలిపారు.

కమలాపురంలో..

కమలాపురం : ముస్లింలు పవిత్రంగా నిర్వహించుకునే పండుగలలో బక్రీద్ పండుగ ఒకటి. ఈ పండుగను త్యాగానికి ప్రతీకగా చెప్పవచ్చు. ఈద్-ఉల్-జుహ అని కూడా ఈ పండుగను పిలుస్తారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం చివరి నెల జిల్ హిజ్జ. ఈనెల 10వ రోజున బక్రీద్ పండును ముస్లిం సోదరులు ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించుకుంటారు. మన భారతదేశంలో సోమవారం ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఈ పండుగను నిర్వహించుకుంటారు. అల్లాహ్ ఆజ్ఞను తుచా తప్పకుండా పాటించడమే ఈ పండుగ అర్థం.

అర్హత ఉన్న ప్రతి ముస్లిం ఖుర్బాని చేయాలి

52 తులాల వెండి లేదా 7.5 తులాల బంగారు ఉన్న ప్రతి ముస్లిం విధిగా ఖుర్బాని చేయాలి. ఖుర్బాని చేసే జంతువులను మూడు భాగాలు చేసి ఒక భాగం సొంతానికి, మరో భాగం పేదలకు, మూడో భాగం బంధువులకు పంచి పెట్టాలి. ఒక వ్యక్తి ఒక పూట తినే విధంగా ఖుర్బాని మాంసం అందించాలని మత పెద్దలు తెలిపారు.

ఏర్పాట్లు సిద్ధం

బక్రీద్ పండుగను సంతోషంగా నిర్వహించుకునేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. స్థానిక ఈద్గా మైదానంలో ఈదు-ఉల్-జుహ ప్రత్యేక నమాజ్ 09.00 గంటలకు నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈద్గా ఆవరణలో షామియానాలు వేసి నమాజ్ ఆచరించేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. అలాగే పట్టణంలోని పలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రార్థనలు చేసే సమయం

మస్జిదె-ఉస్మాన్-7.00, మస్జిదె-అక్సా- 8.00, మస్జిదె-అబూబకర్ సిద్ధిఖ్-8.00, మస్జిదె-ఇబ్రహీం-08.30, మస్జిదె-ఖాదరియ-8.00, మస్జిదె-దరా-ఏ-గఫారియా-09:30

కమలాపురం పట్టణానికి చెందిన ముస్లింలు నమాజ్ వేళలు అనుసరించి తప్పనిసరిగా నమాజ్ చేసుకోవాలని ముస్లిం మత పెద్దలు తెలిపారు.

ముస్తాబైన మసీదులు

లింగాల : మండలంలో బక్రీదు సందర్భంగా మసీదులను, ఈద్గాలను ముస్తాబు చేశారు. సోమవారం బక్రీదు పండుగను పురస్కరించుకుని ముస్లింలు మసీదులలో, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. వారి పితృదేవతలకు చదివింపులు నిర్వహించి పేదలకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. మండలంలోని లింగాల, పార్నపల్లి, వెలిదండ్ల, పెద్దకుడాల, మురారి చింతల, తదితర గ్రామాల్లోని మసీదులు బక్రీదు పండుగ నిర్వహణకు ముస్తాబయ్యాయి.

పేదలకు సాయం చేయాలి

జమ్మలమడుగు : త్యాగానికి ప్రతిరూపం బక్రీద్ పండుగ అని ఆస్తాన యే గౌసియా పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ, పెద్దమసీదు పీఠాధిపతి సయ్యద్‌షా సాదిక్ పాషా ఖాద్రీలు పేర్కొన్నారు. సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా భక్తులకు ఆదివారం ప్రత్యేకంగా బక్రీద్ పండుగ గురించి వివరించారు. బక్రీద్ పండుగ సందర్భంగా ధనవంతులు నిరుపేదలు తమతో సమానంగా పండుగ నిర్వహించుకునే విధంగా వారికి



మాట్లాడుతున్న పీఠాధిపతి గౌస్‌పీరాఖాద్రీ

సాయం చేయాలన్నారు. ఖుర్బానీ ఇచ్చిన వారు దానిని మూడువాటాల కింద వేసి నిరుపేదలకు, బంధువులకు, స్నేహితులకు రెండు భాగాలు ఇచ్చి ఒక భాగం ఖుర్బానీ ఇచ్చిన వారుపెట్టుకోవాలన్నారు. నిరుపేదలకు ఇచ్చే ఖుర్బానీ కనీసం వారు ఒక్కపూట అయిన ఉండాలన్నారు. అలా లేని పక్షంలో ఖుర్బానీ ఇచ్చిన ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. నమాజ్‌కు(ప్రార్థనలకు) వచ్చేవారు సోమవారం ఉదయ తొమ్మిదిగంటల లోపు పూర్తి చేసుకున్న అనంతరం ఖుర్బానీ ఇవ్వాలన్నారు. అర్హత ఉన్న వారు కచ్చితంగా జీవిత కాలంలో ఒక్కసారైన హజ్ యాత్ర చేయాలని వారు సూచించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు



ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి

వేముల : స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ 18వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఆలయంలో హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను గ్రామోత్సవం నిర్వహించారు. కోలాటం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం బక్రీద్ పండుగను ముస్లింలు సంతోషంగా, ఆనందంగా జరుపుకోవాలని కోరారు. బక్రీద్ అంటేనే త్యాగమని, దేవుని స్మరణతో, అందరూ సేవాభావం కలిగి ఉండాలని దేవున్ని కోరుతున్నామన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీలో గోల్‌మాల్?

- దాదాపు 2వేల నోట్‌బుక్స్ మాయం
- కొన్ని పాఠశాలలకు అందని పుస్తకాలు
- ఎంఈఓ తీరుపై విమర్శలు



ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు

పులివెందుల టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ ఈ విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేనాటికి విద్యార్థులకు అందజేయాలనే సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను, నోట్‌బుక్స్‌ను అన్ని జిల్లాలకు అక్కడి నుంచి మండల కేంద్రాలకు అందజేయడం జరిగింది. మండల కేంద్రంగా ఎంఈఓల ఆధ్వర్యంలో ఆయా మండలాల్లోని పాఠశాలలకు పుస్తకాలు అందించడం జరిగింది. అయితే పులివెందుల మండల కేంద్రంలో ఎంఈఓ-2గా ఉన్న రామానాయుడు ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ జరగాల్సి ఉంది. అయితే ఈ పంపిణీ వ్యవహారంలో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరిగినట్లు సమాచారం. విద్యార్థులకు అందజేయాల్సిన దాదాపు 2వేల నోట్‌బుక్స్ మాయమైనట్లు తెలుస్తోంది. గీతల నోట్‌బుక్స్ 891, గీతలులేని నోట్‌బుక్స్ 1176, బ్రాడ్‌బుక్స్ 99, గ్రాఫ్‌బుక్స్ 11 మాయమైనట్లు సమాచారం. పాఠ్యపుస్తకాలను స్థానిక అహోబిలాపురం ప్రభుత్వ పాఠశాలలో భద్రపరచి అక్కడి నుంచి ఎంఈఓ రామానాయుడు సంబంధిత పాఠశాలల హెడ్‌మాస్టర్లకు పంపిణీ చేశారు. అయితే దాదాపు 2వేల పుస్తకాలు మాయమవడం చర్చనీయాంశమైంది. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు అక్కడక్కడ చర్చించుకుంటున్నారు. పుస్తకాలు మాయంకావడంతో ఎంఈఓ హస్తమున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. పేద విద్యార్థుల పాఠ్యపుస్తకాల విషయంలో అధికారులు ఇలా వ్యవహరించడంపై పలువురు విమర్శలు చేయడం జరిగింది. దీనిపై ఎంఈఓ రామానాయుడును వివరణ కోరగా పాఠ్యపుస్తకాలు మిస్ అయిన విషయం వాస్తవమేనని, అన్ని పాఠశాలల్లో ఇచ్చిన పుస్తకాలను సరి చూసుకుని రికవరీ చేయడం జరుగుతుందన్నారు.

కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీతలకు అభినందనలు

కడప కల్చరల్ : కేంద్రసాహిత్య అకాడమి-2024 ప్రకటించిన పురస్కారాలు పొందిన పి.చంద్రశేఖర్ ఆజాద్, రమేష్ నాయక్ కార్తీక్‌లకు సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామ ప్రసాదరెడ్డి, సిబ్బంది అభినందనలు తెలియజేశారు. చంద్రశేఖర్ ఆజాద్ రచించిన 'మాయాలోకం'బాలల కథా సంపుటికి అకాడమీ బాలసాహిత్యంలో పురస్కారం ప్రకటించిందని, రమేష్ నాయక్ కార్తీక్ రచించిన కథల సంపుటి 'ఢావ్లో' కు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించిందన్నారు. ఈ సందర్భంగా వారు రచించిన పుస్తకాలను ప్రస్తావించారు. అలాగే బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ, గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు, ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులను అభినందిస్తున్న నాయకులు, అధికారులు

బద్వేలు అర్బన్ : కష్టపడి చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వైవీయూ పాలక మండలి సభ్యులు కొండపల్లి చిన్నసుబ్బారావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ వై.గోపాలస్వామి పేర్కొన్నారు. బీసీ బాలుర వసతిగృహంలో పది పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన 11 మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఆదివారం బీసీ వసతిగృహంలో పూలే ఆశయసాధన సమితి చైర్మన్ బి.గురుమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కృషి, పట్టుదలతో ప్రయత్నిస్తే సాధించలేనిది ఏదీ లేదని, ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. అలాగే విద్యార్థుల విజయానికి కారణమైన హాస్టల్ వార్డెన్ ప్రసాద్‌ను సన్మానించారు. మండల విద్యాశాఖాధికారి చెన్నయ్య, శ్రీరామ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శ్రీరామరాజు, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు సుబ్బరాయుడు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమణయాదవ్, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, పట్టణ అభివృద్ధి కన్వీనర్ నానబాలవెంకటేశ్వర్లు, ఆవాజ్ పట్టణ అధ్యక్షులు సత్తార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అన్వర్‌బాషా, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేపకాయలకు గిరాకీ



వేపకాయలను ఏరుకుంటున్న మహిళలు

రాజుపాలెం: ఖరీఫ్ సీజన్‌లో వేపకాయల వినియోగం పెరుగుతోంది. దీంతో వేపకాయలకు గిరాకీ పెరుగుతోంది. కొన్ని గ్రామాల్లోని మహిళలు వేప కాయలను సేకరిస్తూ వాటిని అమ్ముకుంటూ జీవనం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా అడపాదడపా వర్షాలు పడటంతో వ్యవసాయ పనులు లేకపోవడంతో వేపకాయలను సేకరించుకుంటున్నామని తెలిపారు. డబ్బా రూ.150 చొప్పున వాటిని విక్రయిస్తున్నామని తెలిపారు.

ఏపీఎండీసీ డైరెక్టర్ రాజీనామా

అట్లూరు: రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముడమాల బాలమునిరెడ్డి ఆదివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమకు పదవి ముఖ్యం కాదని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కోసం పనిచేస్తామని ప్రకటించారు. కూటమి అధికారంలోకి రావడంతో తమ పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు.

తహసీల్దార్ అవినీతిపై విచారణ జరిపించాలి

జమ్మలమడుగు : ఎన్నికలకు సంబంధించిన నిధుల గోల్‌మాల్ విషయంలో తహసీల్దార్ కరుణాకర్, డిటీ వేణుగోపాల్‌లపై విచారణ జరిపించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషనర్ కోటి ఆరవైరెండు లక్షల రూపాయల నిధులు కేటాయించింది. ఆ నిధులను ఎన్నికల విధులను నిర్వహించిన రెవెన్యూ ఉద్యోగులైన వీఆర్ఏ, వీఆర్వోలతోపాటు ఇతర ఉద్యోగులకు ఇతర ఖర్చులకు ఖర్చుచేయవలసి ఉంది. అయితే తహసీల్దార్, డిటీలు ఎన్నికల విధులను నిర్వహించిన ఉద్యోగులకు ఒక్కపైసా కూడా ఇవ్వలేదు. వీఆర్ఏ, వీఆర్వోలకు నిబంధనల ప్రకారం ఇవ్వవలసిన డబ్బులను ఏమాత్రం ఇవ్వకుండా వారిపట్ల దురుసుగా ప్రవర్తించడం శోచనీయం అన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అవినీతిపై విచారణ చేపట్టి వారిపైకఠిన చర్యలను తీసుకోవడంతోపాటు వెంటనే వారిని విధులనుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్యంపై అధికారులు దృష్టి పెట్టాలి

వేంపల్లె : పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్యం, డ్రైనేజీలపై అధికారులు దృష్టి పెట్టాలని పలుకాలనీ ప్రజలు కోరుతున్నారు. ఆదివారం పలు ప్రాంతాల్లోని ప్రజలు విలేకరుల దృష్టికి తీసుకొచ్చారు. స్థానిక పంచాయతీ పరిధిలోని గరుగువీధి, చైతన్య పాఠశాల, ఉషాకిరణ్ పాఠశాల, బలిజ సంఘం వీధి, భరతనగర్, క్రిస్టియన్‌కాలనీ, కడపరోడ్డు, వడ్డెర వీధి, తదితర ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారాలతో నిండుకున్నాయి. పంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే డ్రైనేజీలో ఉన్న చెత్తచెదారాలు తీకపోవడంతో రోడ్లపైన మురుగు నీరు పారుతుంది. పాదాచారులు, వాహనదారులు బయటికి రావాలంటే భయపడుతున్నారు. రోడ్లపైనే మురుగునీరు పారుతుండటంతో దోమలు అధికరంగా ఉత్పత్తి అవుతున్నాయని తెలిపారు. చాలామంది చిన్నపిల్లలు జ్వరాలతో అల్లాడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంచాయతీ పరిధిలో ఉన్న పారిశుద్ధ్యం, డ్రైనేజీ పనులు నిర్వహించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.




చెత్తాచెదారాలతో నిండిన వేంపల్లె పంచాయతీ

కనులు దోచే కలువ పూలు



పచ్చగా పరుచుకున్న ఆకులు.. వాటిపై రాలిన ముత్యాలాంటి నీటి బిందువులు. నీటి నుంచి నిటారుగా నిలిచిన కాండంపై సిగ్గులొలికే మొగ్గలు, విప్పారిన పుష్పాలు. అలాంటి ఇలాంటి పూలు కాదు దేవతా పుష్పాలు. ఆ పూలు.. తామరలు. చూపరులను ఆకట్టుకునే అందం వాటి సొంతం. పూలంటే సున్నితం.. తామర పూలు మరీ సున్నితం. ఇది జాతీయ పుష్పం కూడా. మండల పరిధిలోని అనంతరాజుపురం పంచాయతీ లక్ష్మీపాలెం గ్రామంలో ఉన్న శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వెనుకభాగంలో తామర మడుగులో తామర పుష్పాలు కనువిందు చేస్తున్నాయి. 16వ శతాబ్దంలో మట్లిరాజులు వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించిన సమయంలోనే ఈ మడుగును కూడా తవ్వించారు. ఇక్కడ పూచే తామర పుష్పాలను అప్పట్లో స్వామి వారికి సమర్పించి పూజలు నిర్వహించేవారు. చుట్టుపక్కల గ్రామాల్లో అనేక కుంటలు, మడుగులు ఉన్నప్పటికీ కేవలం ఇక్కడ మాత్రమే తామర పుష్పాలు పూయడం గమనార్హం.

– బద్వేలు అర్బన్



లక్ష్మీపాలెంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కనువిందు చేస్తున్న తామర పుష్పాలు